మనస్సులో ప్రశాంతతతో గుండె పదిలం

- ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ, డాక్టర్ గోపిరెడ్డి
- మహాత్మాగాంధీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ హార్ట్‌డే వేడుకలు
- స్టేడియంలో 5కే వాక్‌కు పచ్చజెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- లాటరీలో విజేతలైన వారికి రూ.40వేలు విలువైన సైకిళ్లు అందజేత



నరసరావుపేటలో నిర్వహించిన 5కే వాక్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ కారసాని

నరసరావుపేట: మనస్సు ప్రశాంతంగా ఉంటేనే గుండె పదిలంగా ఉంటుందని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక మహాత్మాగాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సత్తెనపల్లిరోడ్డులోని కోడెల శివప్రసాదరావు స్టేడియం నుంచి చేపట్టిన 5కేవాక్‌కు ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ హాజరయ్యారు. బెలూన్లు గాలిలోకి వదిలి పచ్చజెండా ఊపి ఐదు కిలోమీటర్ల నడకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ కనీసంగా పావుగంటసేపు అయినా నడక సాగిస్తేనే గుండె సక్రంగా పనిచేస్తుందని, మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉండొచ్చని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నడవటం అంటే గుండెను నడిపించటమేనని, ప్రతి ఒక్కరూ విధిగా గంటపాటు వాకింగ్ చేయాలని సూచించారు.డాక్టర్ కారసాని మాట్లాడుతూ గుండె జబ్బుల గురించి అవగాహన కల్పించటమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. వందలాది మంది డాక్టర్లు, వైద్య సిబ్బంది, పట్టణ పుర ప్రముఖులు, వ్యాపారులు, పుర ప్రజలు, యువతీ యువకులతో స్టేడియం నుంచి ప్రారంభమైన వాక్ బరంపేట బైపాస్‌రోడ్డు, పెద్దచెరువు మీదుగా పల్నాడు రోడ్డుకు చేరుకొంది. అక్కడ నుంచి గడియారం స్తంభం మీదుగా శివునిబొమ్మసెంటర్, మెయిన్ రోడ్డు, మల్లమ్మసెంటర్ నుంచి సత్తెనపల్లి రోడ్డు మీదుగా మళ్లీ స్టేడియానికి చేరుకుంది. అక్కడ గుండెజబ్బులకు గురైన వ్యక్తులను అత్యవసరం చేసే సీపీఆర్ చికిత్సతో పాటు రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, మద్యం తదితర అంశాలపై పలువురు డాక్టర్లు ప్రజలకు వివరించారు. ముందుగా కార్యక్రమంలో పాల్గొనే వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న నంబర్ల ఆధారంగా లాటరీ నిర్వహించి పురుషులు, స్త్రీలకు రూ.40వేలు విలువైన నాలుగు సైకిళ్లను విజేతలకు అందజేశారు. వాక్‌లో పాల్గొన్న కేర్ విద్యాసంస్థ కోటిరెడ్డి స్వల్ప అస్వస్థతకు గురికావడంతో ఆయన్ను అంబులెన్స్ ద్వారా హాస్పిటల్‌కు తరలించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, ఈఎం. స్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, పొన్నపాటి ఈశ్వరరెడ్డి, డాక్టర్లు రాంప్రసాద్, సి.గౌతమి, లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శాఖమూరి బాజీబాబు, నాగప్రియాంక, నాగేశ్వరరావు, పాలూరి శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు డాక్టర్లు, కళాశాల ప్రతినిధులు, యువతీ యువకులు పాల్గొన్నారు.



వినుకొండలో జరిగిన 2కే వాక్‌లో పాల్గొన్న వైద్యులు, పట్టణ ప్రముఖులు

2కే వాక్‌కు స్పందన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీదత్త హాస్పిటల్ ప్రముఖ గుండె వైద్యులు గార్లపాటి కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2కే వాక్‌ను నిర్వహించారు. పట్టణ ప్రముఖులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన నడక స్తూపం సెంటర్, ఏనుగుపాలెం రోడ్డు మీదుగా హాస్పిటల్ వరకు కొనసాగింది. అనంతరం ఏర్పాటు చేసిన సభలో గుండె ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ నడకతో పాటు యోగా, ధ్యానం చేయడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని తెలిపారు. గుండె పనితీరు, స్ట్రోక్ లక్షణాలు, నివారణ చర్యలు గురించి డాక్టర్లు గార్లపాటి కృష్ణకాంత్, గార్లపాటి జ్ఞానేశ్వరి వివరించారు. పలువురి సందేహాల్ని వైద్యులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు పూర్ణిమ, అన్న మణికంఠ సురేష్, వినుకొండ ఐఎంఏ చాప్టర్ అధ్యక్షులు డాక్టర్ ఎల్.ఎస్.రావు, డాక్టర్ ఆనంద్‌కుమార్, డాక్టర్ ప్రసన్న పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలి: ఎస్టీయూ



చిలకలూరిపేట: 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ప్రాంతీయ శాఖల సమావేశం పట్టణంలోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ దసరా పండుగ కానుకగా 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. దీంతో పాటు పెండింగ్ బకాయిలపై ప్రభుత్వం దృష్టి సారించాలని విన్నవించారు. రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి స్కూల్ మేనేజ్‌మెంట్ గ్రాంట్‌ను విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించి, బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్, మక్బుల్ బాషా, దుర్గాప్రసాద్, జి. కోటేశ్వరరావు, సతీష్, మస్తాన్‌వలి, నాగుర్‌వలి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పలు అనర్థాలు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని చాట్రగడ్డపాడులో ఆదివారం సర్పంచ్ నక్క మూర్తిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, స్వర్ణ ఆంధ్రప్రదేశ్ - 2047 విజన్, 100 రోజుల శానిటేషన్ ప్లాన్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఒకసారి వాడి పడేసిన ప్లాస్టిక్‌ను వాడటం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రతి దుకాణానికి నోటీసులు జారీ చేయాలని సర్పంచ్ తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానా విధింస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ ప్రభాకరావు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, నక్కా బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

నరసరావుపేట: కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా సోమవారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక జమీందార్ ఫంక్షన్ హాలులో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశామని నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్ర నియోజకవర్గ అభ్యర్థి గౌతమ్‌రెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని పట్టణ, వార్డు ఇన్‌చార్జీలు, ఎంపీపీలు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, కార్పొరేషన్ శాఖల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్‌లు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కారు ఢీకొని పాల వ్యాపారి మృతి

చిలకలూరిపేట టౌన్: కారు ఢీకొని పాల వ్యాపారి మృతి చెందిన సంఘటన చిలకలూరిపేట మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని గంగన్నపాలెం గ్రామానికి చెందిన గుంజి రామారావు(70) కావూరు, కోమటినేనివారిపాలెం తదితర గ్రామాల్లో నిత్యం తిరిగి పాలు సేకరించి బైక్‌పై చిలకలూరిపేట పట్టణంలో విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఆదివారం పట్టణంలో పాల వ్యాపారం చేసుకుని తిరిగి వచ్చే క్రమంలో 12.30 గంటలకు కారు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో రామారావు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కిరాణా మర్చంట్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



నరసరావుపేట: స్థానిక పట్టాభిరామస్వామి దేవాలయం కల్యాణ మండపంలో ఆదివారం వన్‌టౌన్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా పాల్గొన్నారు. అధ్యక్షులుగా పచ్చిపులుసు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కొప్పురావూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా చిలకల కోటేశ్వరరావుతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు వనమా సాంబశివరావుతో పాటు పలువురు ఆర్య వైశ్యులు సంఘాల నాయకులు హాజరై అభినందనలు తెలిపారు.

ఎస్సీలకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణలు చెప్పాలి

రొంపిచర్ల: తమకు ఓటు వేయని ఎస్సీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వమని ప్రత్తిపాడు శాసనసభ్యుడు బి. రామాంజనేయులు మాట్లాడటం సిగ్గుచేటని దళిత బహుజనుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని నల్లగార్లపాడులో ఆదివారం అంబేడ్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రామాంజనేయులు ఎస్సీ కులంలో పుట్టి రిజర్వేషన్ అనుభవిస్తూ, ఐఏఎస్ చదివారన్నారు. ఎస్సీలు ఓట్లు వేయకుండా ఆయన గెలవటం సాధ్యమా ? అన్ని ప్రశ్నించారు. ఎస్సీలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆయనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రామాంజనేయులు బహిరంగ క్షమాపణలు చెప్పకపోతే ఆందోళనలు చేపడతామని రమేష్‌కుమార్ హెచ్చరించారు.

బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో సెలక్టర్లు

చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ -17, అండర్ -19 బాలబాలికల బాక్సింగ్ జట్ల ఎంపిక ఏఎంజీ హైస్కూల్‌లో ఆదివారం జరిగింది. పోటీల్ని ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, పట్టణ ఎస్ఐ చెన్నకేశవులు ప్రారంభించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి మొత్తం 190 మంది విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొన్నారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏఎంజీ హైస్కూల్ హెచ్ఎం కె. కృపాదానం, బాక్సింగ్ కోచ్ విశ్వనాథ్, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌మస్తాన్, జోన్ అధ్యక్షుడు ఖాసింబుడే పాల్గొన్నారు. జట్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

అండర్-17 బాలికల జట్టు

టి. నందిని, టి. మానస, పి. కీర్తన, పి. కీర్తి, సీహెచ్. శ్యామ్‌శరణ్య, బి. శీజల్, టి. గౌతమి, ఎ. జీవిత, కె. లాస్య, వి. కాత్యాయని, ఆర్. అమృత, డి. ధనూజ, ఎం. జయబ్.

అండర్-17 బాలుర జట్టు

యు. హేమంత్‌కుమార్, సీహెచ్. మణికంఠ, కె. మహేష్‌నాయక్, షేక్ వజీమ్, టి. చరణ్‌తేజ, షేక్ సుభాని, జి. యహోషువా, జె. ఇమ్మాన్యుయేల్, వై. నితిన్‌రెడ్డి, డి. నందకుమార్, ఎస్‌కె. సుభాని, జె. రామారావు, జి. కనీష్క్, డి. హనుమానాయక్.

అండర్-19 బాలికల జట్టు

జి. సురేఖగ్రేస్, టి. అభినయ, షేక్ సల్మా, కె. సుష్మ, ఎ. బ్లెస్సీ, జె. హెమీమా, డి. అమృతమయి, జి. రేణుక, వి. సాధన, పి. శిరీష, ఎ. ఇందిరా ప్రియదర్శిని, పి. చంద్రిక.

అండర్-19 బాలుర జట్టు

సీహెచ్. కార్తిక్, షేక్ బాషిత్, సీహెచ్. చరణ్‌రెడ్డి, పి. సందీప్, ఎం. అరవింద్, యు. చిన్న గోపి, బి. కళ్యాణ్‌బాబు, ఎన్. అజయ్‌నాయక్

రసవత్తరంగా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు



వినుకొండ(నూజెండ్ల): స్థానిక లయోలా హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ అండర్ - 17 బాలబాలికల ఆటల పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ మాట్లాడుతూ పోటీల్లో కొన్ని జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు వచ్చాయని తెలిపారు.బాలుర విభాగంలో గుంటూరు, ప్రకాశం, కడప, తూర్పు గోదావరి, అనంతపురం, చిత్తూరు, విశాఖపట్నం, బాలికల విభాగంలో కర్నూలు, చిత్తూరు, విశాఖపట్నం, గుంటూరు, అనంతపురం, కడప జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు వచ్చాయని ఆయన చెప్పారు. పోటీల్ని వ్యాయామ ఉపాధ్యాయులు టి. యలమంద, ఆర్. రాధాకృష్ణమూర్తి, వై.వి. చిరంజీవిరావు, బి.కొండలు, కె.రాజేష్ పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.

ఘనంగా సీఎస్ఐ వార్షికోత్సవం



కేకు కట్ చేస్తున్న చర్చి పాస్టర్ తదితరులు

రొంపిచర్ల : స్థానిక చపారపు సుబ్బారెడ్డి కాలనీలో ఆదివారం సీఎస్ఐ సంస్థ 78వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కాలనీలో ఏర్పాటు చేసిన సీఎస్ఐ చర్చిలో కేక్‌ను కట్ చేశారు. చర్చి ఫాస్టర్ సత్యం బాబు ప్రత్యేక ప్రార్థనలు చేశానేజ సంస్థ స్థాపన గురించి, చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. పలువురు సంఘ పెద్దలు కార్యక్రమంలో పాల్గొని వార్షికోత్సవ అభినందనలు తెలిపారు. అనంతరం చర్చి ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు నాదెండ్ల మండల సర్వసభ్య సమావేశం

నాదెండ్ల: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఎత్తిపోతల పథకం నిర్వహణకు నిధులు మంజూరు చేయాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటిని కలిసిన గణపవరం గ్రామ రైతులు

నాదెండ్ల: గణపవరం ఎత్తిపోతల పథకం నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని ఆయకట్టు రైతులు కోరారు. ఆదివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి సమస్యలను వివరించారు. సొసైటీ మాజీ చైర్మన్ మాలెంపాటి లక్ష్మీనారాయణ, సాగునీటి సంఘాల మాజీ అధ్యక్షుడు రాయపాటి పెదరామయ్య మాట్లాడుతూ ఆయకట్టులో 1200 ఎకరాల భూమి ఉందని, గణపవరం, నాదెండ్ల, అప్పాపురం, జాష్టివారిపాలెం గ్రామ రైతులకు ఈ పథకం ఉపయోగపడుతుందని తెలిపారు. కొన్ని నెలలుగా పథకం పని చేయడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్‌లో విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పంటల ఆరుతడులకు సాగునీరు అవసరమని వివరించారు. రెండు రోజుల కిందట ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌ను అనుసంధానం చేసి ట్రయల్ రన్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి మరమ్మతులకు నిధులు సమకూర్చాలని కోరారు. తాము కమిటీ ఏర్పాటు చేసుకుని లిఫ్ట్‌ఇరిగేషన్‌ను కొనసాగించుకుంటామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. మరమ్మతుల కోసం నిధుల్ని సమకూరుస్తామని చెప్పారు. ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారిస్తానని ఆయన హామీనిచ్చారు.

మాజీ సర్పంచ్ తిప్పారెడ్డికి ఘన నివాళి



అంతిమ యాత్రలో ట్రాక్టర్ నడుపుతున్న డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల : మండలంలోని కొత్తపల్లిలో ఆదివారం నరసరావుపేట మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ జక్కిరెడ్డి పెద్ద తిప్పారెడ్డి(88) భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రామ సర్పంచ్‌గా తిప్పారెడ్డి గ్రామానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన అంతిమ యాత్రలో పాల్గొని శ్మశాన వాటిక వరకు తిప్పారెడ్డి మృతదేహం ఉన్న ట్రాక్టర్‌ను నడిపి తన అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, గ్రామ సర్పంచులు జిడ్డు ఎర్రయ్య, బికారీ నాయక్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు కోడూరి వెంకటేశ్వరరెడ్డి, పోనుగోటి వెంకట్రావు, బీరం భాస్కర్‌రెడ్డి, కాసినేడి మస్తానయ్య, ఇగుటూరి రంగారెడ్డి, పడాల హనిమిరెడ్డి, దుద్దుకుంట సైదులరెడ్డి పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు ఇచ్చిన వాగ్దానాలు అమలుచేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న శివకృష్ణ ప్రసాద్

నరసరావుపేట ఈస్ట్: ఎన్నికల సమయంలో బ్రాహ్మణులకు ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ పల్నాడు జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ప్రకాష్‌నగర్‌లోని సమాఖ్య కార్యాలయంలో ఆదివారం అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి సమాఖ్య ప్రతినిధులు హాజరయ్యారు. బ్రాహ్మణులకు అన్ని రంగాలలోనూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దేవాలయాలు, బ్రాహ్మణులపై జరుగుతున్న దాడుల్ని అరికట్టేందుకు ప్రత్యేక చట్టాల్ని రూపొందించాలని కోరారు. కార్పొరేషన్‌లో కుంటుపడిన పథకాలను కొనసాగించాలని, రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో నామినేటెడ్ పోస్ట్‌ల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ తీర్మానించారు. ప్రతి నియోజకవర్గంలో బ్రాహ్మణ భవనాన్ని ఏర్పాటు చేయాలని, వేద విద్యను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులకు నెలకు రూ.1000 ఉపకార వేతనం అందివ్వాలని కోరారు.

పొలం బాట వివాదంలో రైతుపై దాడి

శావల్యాపురం: పొలానికి వెళ్లిన రైతుపై మరో రైతు దాడిచేసి గాయపరచిన సంఘటన మండలంలోని కారుమంచిలో జరిగింది.సేకరించిన వివరాల ప్రకారం.. కారుమంచి గ్రామానికి చెందిన బొల్లా చంద్రశేఖర్ అనే రైతు వెల్లలచెరువు వద్దనున్న తన పొలంలో దున్నేందుకు ట్రాక్టర్‌తో వెళ్లగా దారి లేదని అదే గ్రామానికి చెందిన శాఖమూరి వెంకట్రావు దుర్భాషలాడుతూ పారతో దాడి చేశాడు. గాయాలైన చంద్రశేఖర్‌ను కుటుంబ సభ్యులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పొలాలకు చెందిన బాట తొమ్మిది అడుగులు ఉందని చెబుతున్నప్పటికీ దాడి చేసినట్లు బాధితుడు చంద్రశేఖర్ తెలిపాడు.

జాషువా కళా సమితి 29వ వార్షికోత్సవాలు



సన్మాన గ్రహీతలు

క్రోసూరు: సత్తెనపల్లి జాషువా కళా సమితి సమాఖ్య 29 వార్షికోత్సవాలు, గుర్రం జాషువ జయంతి వేడుకల కార్యక్రమం స్థానిక జై భారత్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఆర్ఐఈసీ సెక్రటరీ రాసంసెట్టి నరసింహారావు పాల్గొన్నారు. సమాఖ్య అధ్యక్షుడు ముట్లూరి వెంకయ్య అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా డైట్ కాలేజి ప్రిన్స్‌పల్ ఎన్.విక్టర్ రవిసాగర్, సాహితీ వేత్త ఊటుకూరు వరప్రసాద్ పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులు ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఎంఈవో 2 గణేష్ , వివిధ రంగాల్లో సేవలందించిన మన్నెం శ్రీనివాసరావు, శిఖా శ్యాంసన్, అనుమోల పూర్ణచంద్రరావు, రాయిరాంరెడ్డి, ముత్యాల తిరుమలరెడ్డిని ఘనంగా సత్కరించారు. స్కూల్ డైరెక్టర్ జైనేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఎంఈవో 2 గణేష్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సత్తెనపల్లి సీఐగా విజయ్‌కుమార్



సత్తెనపల్లి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.విజయ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు-1 టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తూ ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన సీహెచ్ శ్రీనివాసరావుకు సీఐగా పదోన్నతి రావడంతో ఎర్రగొండపాలెం బదిలీ అయ్యారు. 2007లో ఎక్సైజ్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్ శిక్షణ అనంతరం పొన్నూరు, ఎర్రగొండపాలెం స్టేషన్లలో పనిచేశారు. సీఐగా గురజాల, పెదకూరపాడు, గుంటూరు-2 టౌన్, వెంకటగిరి, గూడూరు, గుంటూరు-1 టౌన్ స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం పాలసీని సమర్థంగా అమలు చేసి, మత్తు పదార్థాలను, అక్రమ మద్యాన్ని అరికట్టడానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. సీఐగా పదోన్నతి పొందిన క్రోసూరు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ తెల్లపాటి తులసి, సిబ్బంది మర్యాపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు.

బాల్ బాడ్మింటన్ పోటీల్లో విద్యార్థినులకు పతకాలు



పతకాలతో విద్యార్థినులు

శావల్యాపురం: జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం హైస్కూలు విద్యార్థినులు బండారు దేవముని, ముట్లూరి లూథియా సత్తా చాటి వెండి పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. హరియాణాలో ఈనెల 25 నుంచి 28 వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఇద్దరూ పాల్గొని ద్వితీయ స్థానం సాధించినట్లు పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి చెప్పారు. విద్యార్థినులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, శ్రీకాంత్, భువనేశ్వరి అభినందించారు.

దేవీ నవరాత్రులకు ఆలయాల ముస్తాబు

రొంపిచర్ల: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దేవీ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరావు ఆదివారం తెలిపారు. అక్టోబర్ 3న అమ్మవారు భక్తులకు బాలా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 4న కౌమారి, 5న శ్రీవైష్ణవి, 6న మహేశ్వరి, 7న మహంకాళి, 8న లక్ష్మీదేవి, 9న సరస్వతి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిస్తారని వివరించారు. దేవాలయంలో అమ్మవారి అలంకారాలతో పాటు కుంకమ పూజలు, అర్చనలు నిర్వహిస్తారని, భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

శావల్యాపురంలో..

స్థానిక శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో దసరా ఉత్సవాలను అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని ధర్మకర్త రెడ్డి జ్వాలానరసింహారావు ఆదివారం తెలిపారు. 3న బాలా త్రిపురసుందరి, 4న శ్రీలక్ష్మి, 5న అన్నపూర్ణ, 6న లలితా త్రిపురసుందరి, 7న మహాచండి, 8న గాయత్రి, 9న సరస్వతి, 10న దుర్గాదేవి,11న మహిషాసురమర్దిని, 12న రాజరాజేశ్వరి అలంకరణతో భక్తులకు అమ్మవారు దర్శనం ఇస్తారని వివరించారు. అమ్మవారి అలంకరణ రావిపాటి సాయి భరత్, పూజలు శ్రీమన్నా నారాయణ సారథ్యంలో జరుగుతాయని పేర్కొన్నారు. రాత్రి పూట ఆలయం ప్రాంగణంలో భక్త బృందం ఆధ్వర్యంలో భజనలు నిర్వహిస్తామని తెలిపారు. మహిళలకు లాటరీ ద్వారా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు. భక్తులంతా పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హైవేపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు



బోర్డును ఏర్పాటు చేస్తున్న సీఐ సుబ్బానాయుడు, ఎస్ఐ బాలకృష్ణ

నాదెండ్ల: జాతీయ రహదారి యడ్లపాడు ఎస్ఐఎల్ టెక్స్‌టైల్స్ వద్ద ఆదివారం పోలీసులు ప్రమాద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున యాక్సిడెంట్ ఏరియాగా హెచ్చరిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. వాహనదారులు వేగాన్ని తగ్గించి నెమ్మదిగా వెళ్లాలంటూ పేర్కొన్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ బత్తిన సుబ్బానాయుడు, ఎస్ఐ వి. బాలకృష్ణ మాట్లాడుతూ రహదారిపై ఎలాంటి సమస్యలు ఎదురైనా డయల్ 112కు ఫోన్ చేయాలని సూచించారు.